TG/TEL/25/A3731

# నిజం
దృష్టి తెలుగు న్యూస్

హైదరాబాద్ | ఎడిటర్: వరుదు సుజాత | సంపుటి:-1 | సంచిక:-185 | పేజీలు:-4 | గురువారం 18-06-2026

SIMULTANEOUSLY PRINTED AT ADHILABAD I HYDERABAD |NALGONDA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | WARANGAL | MANGALAGIRI | NELLORE | NIZAMABAD | ANANTAPUR | GUNTUR| KADAPA | ONGOLE | RAJAHMUNDRY | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM

WANTED
రిపోర్టర్లు కావలెను
నిజం దృష్టి తెలుగు న్యూస్
దినపత్రికలో పనిచేయుటకు తెలంగాణ,ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం లోని అన్ని జిల్లా కేంద్రాలకు రిపోర్టర్లు కావలెను
ఆయా జిల్లాల్లోని రాజకీయాలు, ఇతర అంశాలపై లోతైన విశ్లేషణలు రాయగల సామర్థ్యం ఉండాలి, అనుభవం గల వారికి ప్రాధాన్యత ఇవ్వబడును.
సెల్: 9247842354

## ట్రంప్ ఎదుటే నావికుల భద్రతపై గళమెత్తిన మోదీ

★జీ7 సదస్సులో భాగంగా ట్రంప్‌తో మోదీ భేటీ

★భారత నావికుల భద్రత తమకు ముఖ్యమన్న ప్రధాని మోదీ

★నావికులకు రక్షణ కల్పించాల్సిన అవసరం ఉందని వ్యాఖ్య



ఫ్రాన్స్‌లో జరుగుతున్న జీ-7 శిఖరాగ్ర సదస్సులో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అంతర్జాతీయ నావికుల భద్రత అంశాన్ని బలంగా ప్రస్తావించారు. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌తో సమావేశమైన సందర్భంగా, ఇటీవలే అమెరికా జరిపిన సైనిక దాడిలో ముగ్గురు భారతీయ నావికులు మరణించిన ఘటనను ఆయన - మిగతా 2 లో

## 'ఒప్పందం నచ్చకపోతే మళ్లీ బాంబులేస్తాం'

ఇరాన్‌కు ట్రంప్ హెచ్చరిక

● అమెరికా-ఇరాన్ ఒప్పందంపై ట్రంప్ కీలక వ్యాఖ్యలు

● ఒప్పందం ఇంకా తుది రూపం దాల్చలేదన్న అమెరికా అధ్యక్షుడు

● ఇరాన్ ప్రవర్తనపై కూడా ఘాటు వ్యాఖ్యలు

● ఫ్రాన్స్‌లో జీ7 సదస్సు సందర్భంగా వ్యాఖ్యలు

● ట్రంప్ ప్రకటనతో అంతర్జాతీయంగా చర్చ



అమెరికా-ఇరాన్ మధ్య నెలల తరబడి కొనసాగిన ఉద్రిక్తతలకు ముగింపు పలికే ఒప్పందం కుదిరే దశలో ఉన్న వేళ అమెరికా అధ్యక్షుడు - మిగతా 2 లో

# విద్యతోనే జీవితాల్లో మార్పు

★ప్రభుత్వ పాఠశాలలను చిన్నచూపు చూడొద్దు: రేవంత్ రెడ్డి

★ఆరుట్లలో తెలంగాణ పబ్లిక్ స్కూల్‌ను ప్రారంభించిన సీఎం

★విద్యారంగానికి రూ.27 వేల కోట్ల వ్యయం చేస్తున్నట్లు వెల్లడి

★త్వరలో స్పోర్ట్స్ యూనివర్సిటీ

★కులవివక్ష నిర్మూలన లక్ష్యంగా ఇంటిగ్రేటెడ్ స్కూల్స్

★ప్రభుత్వ పాఠశాలల ద్వారా మట్టిలో మాణిక్యాలను వెలికితీస్తామన్న సీఎం




తెలంగాణ భవిష్యత్ పునర్నిర్మాణం అద్దాల మేడల్లో కాదని.. తరగతి గదుల్లోనే ఉందని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. విద్యార్థులపై పెట్టేది ఖర్చు కాదని, రాష్ట్ర భవిష్యత్తు కోసం పెట్టే పెట్టుబడని తెలిపారు. విద్య ఒక్కటే జీవితాలను సమూలంగా మార్చగలదని అన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదివిన విద్యార్థులు కూడా భవిష్యత్తులో ప్రధాని, ముఖ్యమంత్రి, ఐఏఎస్, ఐపీఎస్, డాక్టర్లు, ఇంజినీర్లు, లాయర్లు, ప్రజాప్రతినిధులు

## పోలవరం ముంపుపై కేంద్రం కీలక లేఖ



➤కాగితాలపై కాదు క్షేత్రస్థాయిలో చూపించాలన్న హరీశ్ రావు

➤తెలంగాణ పరిధిలో ముంపు ప్రాంతాలను ఆదుకుంటామన్న పోలవరం ప్రాజెక్ట్ అథారిటీ

➤పీపీఏ రక్షణ హామీ ఇవ్వడాన్ని స్వాగతిస్తున్నామన్న హరీశ్ రావు

➤ఇచ్చిన హామీ ఫైళ్లకే పరిమితం కాకుండా చూడాలని విన్నపం

తెలంగాణ సరిహద్దు గ్రామాలను భయపెడుతున్న పోలవరం ప్రాజెక్ట్ బ్యాక్ వాటర్ - మిగతా 2 లో

## కేసీఆర్ తిరిగి పార్టీలోకి ఆహ్వానిస్తే కవిత సమాధానం ఏమంటే?




● కేసీఆర్, బీఆర్ఎస్ పార్టీతో రాజీపడే ప్రసక్తే లేదన్న కవిత

● బీఆర్ఎస్ ఒక ముగిసిన అధ్యాయమని, ఆ పుస్తకాన్ని తాను మూసేశానని వ్యాఖ్య

● తన కొత్త పార్టీ 'తెలంగాణ రక్షణ సేన'తోనే రాజకీయ ప్రయాణం కొనసాగిస్తానన్న కవిత

తన తండ్రి, బీఆర్ఎస్ అధినేత కే చంద్రశేఖర్ రావుతో గానీ, ఆ పార్టీతో గానీ తిరిగి కలిసే ప్రసక్తే లేదని - మిగతా 2 లో

## ఎంపీల ఫోన్లు స్విచ్ఛాఫ్ 'ఉద్ధవ్ సేన'లో తిరుగుబాటు ఆందోళన!



● ఆరుగురు ఎంపీలు షిండే శిబిరంతో సంప్రదింపులు జరుపుతున్నట్లు ప్రచారం

● కొందరు ఎంపీల ఫోన్లు స్విచ్ఛాఫ్ కావడంతో ఉద్ధవ్ వర్గంలో ఆందోళన

● ఢిల్లీలో షిండే వర్గ నేతలతో ఎంపీల సమావేశం జరిగే అవకాశం ఉన్నట్లు వార్తలు

● తలుపులు తెరిచి ఉన్నాయని మంత్రి ప్రతాప్ సార్నాయక్ వ్యాఖ్య

● ఎంపీల కొనుగోలుకు ఒక్కొక్కరికి రూ.15 కోట్లు ఇస్తున్నారని సంజయ్ రౌత్ ఆరోపణ

మహారాష్ట్ర రాజకీయాల్లో మరోసారి సంచలన పరిణామాలు చోటుచేసుకుంటున్నాయి. ఉద్ధవ్ ఠాక్రే - మిగతా 2 లో

# ఇన్‌స్టాగ్రామ్‌లో మనమే తోపులం
# మోదీతో మెలోనీ సరదా వ్యాఖ్యలు

▶▶ +7 సదస్సులో మళ్లీ కలిసిన ప్రధాని మోదీ, ఇటలీ పీఎం మెలోనీ

▶▶ సోషల్ మీడియాలో మేం చాలా ఫేమస్ అంటూ మెలోనీ సరదా వ్యాఖ్య

▶▶ గతంలో వైరల్ అయిన 'మెలోడి' ట్రెండ్‌కు మళ్లీ ఊపు

▶▶ ఇద్దరు నేతల స్నేహపూర్వక సంభాషణ వీడియో వైరల్




ఫ్రాన్స్‌లో జరుగుతున్న +7 సదస్సు వేదికగా భారత ప్రధాని నరేంద్ర మోదీ, ఇటలీ ప్రధాని జార్జియా మెలోనీ మధ్య ఆసక్తికర సంభాషణ చోటుచేసుకుంది. దీంతో సోషల్ మీడియాలో వారిద్దరి పేర్లతో ముడిపడిన

## క్షమాపణ చెప్పాలి, కోటి కట్టాలి.. స్టాలిన్‌కు టీవీకే నేత లీగల్ నోటీసు



● మాజీ సీఎం స్టాలిన్‌కు టీవీకే నేత ఆదవ్ అర్జున లీగల్ నోటీసు

● డ్రగ్స్ కేసుతో తనకు సంబంధాలు అంటగట్టారని ఆరోపణ

● 48 గంటల్లో క్షమాపణ చెప్పి, రూ. కోటి పరిహారం చెల్లించాలని డిమాండ్

● లేనిపక్షంలో చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరిక

● తమిళనాట డీఎంకే, టీవీకే మధ్య ముదురుతున్న రాజకీయ వివాదం

తమిళనాడు రాజకీయాల్లో మరో తీవ్ర వివాదం రాజుకుంది. డ్రగ్స్ స్మగ్లింగ్ కేసుతో - మిగతా 2 లో

## తెలంగాణలోని హన్మకొండలో పవన్ కల్యాణ్ పర్యటన



❖ తీవ్ర నరాల సమస్యతో బాధపడుతున్న చిన్నారిని కలిసిన పవన్

❖ ఆరోగ్య పరిస్థితి, చికిత్స వివరాలను తెలుసుకున్న వైనం

❖ హన్మకొండ నుంచి నేరుగా విజయవాడ వెళ్లనున్న పవన్

ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ తెలంగాణలోని హన్మకొండలో పర్యటించారు. స్థానిక హనుమాన్ నగర్‌కు చెందిన 15 ఏళ్ల నిరంజన్ అనే బాలుడు తీవ్రమైన - మిగతా 2 లో

## తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డికి థ్యాంక్స్ చెప్పిన ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్



➤అరుదైన వ్యాధితో బాధపడుతున్న అభిమాని నిరంజన్‌ను పరామర్శించిన పవన్

➤హనుమకొండ పర్యటనకు సహకరించిన తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డికి కృతజ్ఞతలు

➤తెలంగాణ పోలీసు శాఖకు, అధికారులకు పేరుపేరునా ధన్యవాదాలు తెలిపిన పవన్

➤తెలంగాణ ప్రజలు చూపిస్తున్న ప్రేమను జీవితాంతం గుర్తుంచుకుంటానని ట్వీట్

➤నిరంజన్ ధైర్యం, ఆత్మవిశ్వాసం స్ఫూర్తిదాయకమని ప్రశంసలు

ఏపీ డిప్యూటీ జనసేన అధినేత పవన్ కల్యాణ్ తన మానవత్వాన్ని మరోసారి చాటుకున్నారు - మిగతా 2 లో

# ఎల్‌నినో ప్రభావం పంటల మార్పిడిపై సీఎం చంద్రబాబు దృష్టి

▶▶ పంటల మార్పిడి అవకాశాలను పరిశీలించాలని సూచన

▶▶ ప్రకృతి సేద్యం వైపు రైతులను ప్రోత్సహించాలని ఆదేశం

▶▶ పొగాకు, ఆక్వా రైతుల సమస్యలపై సమావేశాలకు నిర్దేశం

▶▶ కష్టకాలంలో రైతులను ఆదుకోవడమే ప్రభుత్వ ధ్యేయమని స్పష్టీకరణ




ఎల్‌నినో ప్రభావంతో రాష్ట్రంలో నెలకొన్న ప్రత్యేక పరిస్థితుల దృష్ట్యా వ్యవసాయ రంగంపై ప్రత్యేక దృష్టి సారించాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధికారులను ఆదేశించారు. సచివాలయంలో

నిజం
దృష్టి తెలుగు న్యూస్
TG/TEL/25/A3731
గురువారం 18-06-2026

## ఎల్‌నినో ప్రభావం పంటల మార్పిడిపై సీఎం చంద్రబాబు దృష్టి

మొదటిపేజీ తరువాయి – వ్యవసాయ, ఉద్యానవనం, ఆక్వా రంగాలపై ఆయన ఉన్నత స్థాయి సమీక్ష నిర్వహించారు. గత అనుభవాలను పరిగణనలోకి తీసుకుని, పంట మార్పిడి దిశగా రైతులకు తగిన సూచనలు, సలహాలు అందించాలని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ, రైతులను పెద్ద ఎత్తున ప్రకృతి సేద్యం వైపు మళ్లించేలా తగిన చర్యలు చేపట్టాలని సూచించారు. అంతర్జాతీయ మార్కెట్‌లో వ్యవసాయ ఉత్పత్తుల సర్టిఫికేషన్‌కు ప్రాధాన్యత పెరుగుతున్న దృష్ట్యా, ఈ అంశాలపై రైతులకు విస్తృత అవగాహన కల్పించాలన్నారు. ఇలాంటి చైతన్య కార్యక్రమాల్లో తాను కూడా స్వయంగా పాల్గొంటానని ముఖ్యమంత్రి పేర్కొన్నారు. రైతులు శాస్త్రీయ విధానాల్లో సాగు చేపట్టేలా ప్రోత్సహించాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు. మిర్చి, పొగాకు, తోతాపురి మామిడి రైతులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి ముఖ్యమంత్రి అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. పొగాకు కొనుగోలుదారులతో వెంటనే సమావేశం ఏర్పాటు చేయాలని సూచించారు. మార్కెట్‌లో గిట్టుబాటు ధర లభించే వరకు పంటను నిల్వ చేసుకునేందుకు ఉన్న అవకాశాలను పరిశీలించాలని తెలిపారు. అధిక డిమాండ్ ఉన్న పప్పు దినుసుల సాగును ప్రోత్సహించడం ద్వారా రైతులకు గరిష్ఠ ప్రయోజనం చేకూరేలా చూడాలన్నారు. వ్యవసాయ, ఉద్యాన ఉత్పత్తులకు విలువ జోడింపు అవసరాన్ని ఆయన ఈ సందర్భంగా నొక్కిచెప్పారు. విపత్కర పరిస్థితుల్లో రైతులను ఆదుకోవడమే కూటమి ప్రభుత్వ ప్రధాన ధ్యేయమని ముఖ్యమంత్రి పునరుద్ఘాటించారు. ఆక్వా రైతులు, ఫీడ్ తయారీదారుల సమస్యల పరిష్కారానికి వారితోనూ సమావేశం కావాలని ఆదేశించారు. ఈ సమీక్షా సమావేశంలో వ్యవసాయ శాఖ మంత్రి కింజారపు అచ్చెన్నాయుడు, ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి సాయి ప్రసాద్‌తో పాటు పలు శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## తెలంగాణలోని హన్మకొండలో పవన్ కల్యాణ్ పర్యటన

మొదటిపేజీ తరువాయి – నరాల సమస్యతో బాధపడుతున్నాడు. దురదృష్టవశాత్తూ వయసు 15 ఏళ్లయినా ఆ వ్యాధి కారణంగా కేవలం రెండు, మూడేళ్ల పిల్లాడిలాగే కనిపిస్తాడు, పైగా కాళ్లు కూడా పనిచేయవు. జీవితంతో పోరాడుతున్న ఆ చిన్నారికి తన అభిమాన హీరో పవన్ కల్యాణ్‌ను కలిసి, ఆయన సినిమా డైలాగ్‌ను ఆయన ముందే చెప్పాలనేది ఒకే ఒక్క చివరి కోరిక. ఈ విషయం తెలుసుకున్న పవన్ కల్యాణ్, నేరుగా ఆ బాలుడి ఇంటికి వెళ్లి పరామర్శించారు. నిరంజన్‌ను ప్రేమగా పలకరించి, వారి తల్లిదండ్రులతో మాట్లాడి బాలుడి ఆరోగ్య పరిస్థితి, అందిస్తున్న చికిత్స వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ భావోద్వేగ భేటీ ముగిసిన తర్వాత పవన్ కల్యాణ్ హన్మకొండలోని ప్రసిద్ధ భద్రకాళి అమ్మవారి ఆలయానికి వెళ్లి దర్శనం చేసుకోనున్నారు. ఆ తర్వాత స్థానిక రిసార్ట్‌లో జనసేన కార్యకర్తలతో (జనసైనికులతో) ఏర్పాటు చేసిన సమావేశంలో పాల్గొంటారు. అక్కడే లంచ్ కార్యక్రమంలో పాల్గొని, అనంతరం తిరిగి విజయవాడకు ప్రయాణమవుతారు. మరోవైపు, పవన్ కల్యాణ్ ను చూసేందుకు హన్మకొండలో అభిమానులు పోటెత్తారు.

## కేసీఆర్ తిరిగి పార్టీలోకి ఆహ్వానిస్తే...: కవిత సమాధానం ఏమంటే?

మొదటిపేజీ తరువాయి – టీఆర్ఎస్ అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత స్పష్టం చేశారు. బీఆర్ఎస్ ఒక ముగిసిన అధ్యాయమని, ఆ పుస్తకాన్ని తాను ఇప్పటికే పూర్తిగా మూసేశానని ఆమె సంచలన వ్యాఖ్యలు చేశారు. తన నూతన పార్టీ తెలంగాణ రక్షణ సేన (టీఆర్ఎస్) ద్వారానే సరికొత్త చరిత్రను లిఖిస్తానని ఆమె ఉద్ఘాటించారు. ఇటీవల ఒక ఇంటర్వ్యూలో పాల్గొన్న కవిత, ఒకవేళ కేసీఆర్ తిరిగి పార్టీలోకి ఆహ్వానిస్తే వెళ్తారా? అన్న ప్రశ్నకు సూటిగా సమాధానమిచ్చారు. “ఖచ్చితంగా ఆ అధ్యాయం ముగిసింది. జీవితంలో కొన్నిసార్లు పేజీలు తిప్పాలి, మరికొన్నిసార్లు పుస్తకాలనే మూసివేయాలి. నేను బీఆర్ఎస్ అనే పుస్తకాన్ని ఎప్పుడో మూసివేశాను” అని ఆమె పేర్కొన్నారు. గత ఏడాది సెప్టెంబర్‌లో కవితను బీఆర్ఎస్ పార్టీ నుంచి సస్పెండ్ చేసిన విషయం తెలిసిందే. హరీశ్ రావు, జోగినపల్లి సంతోష్ కుమార్ తదితరులు కాళేశ్వరం ప్రాజెక్టు విషయంలో కేసీఆర్ ప్రతిష్టకు భంగం కలిగించారని ఆమె బహిరంగంగా ఆరోపణలు చేయడంతో పార్టీ ఈ కఠిన నిర్ణయం తీసుకుంది. ఆ తర్వాత, ఈ ఏడాది ఏప్రిల్‌లో ఆమె ‘తెలంగాణ రక్షణ సేన’ పేరుతో సరికొత్త రాజకీయ పార్టీని స్థాపించారు. బీఆర్ఎస్ పాలనలో తనకు అనేక చేదు అనుభవాలు ఎదురయ్యాయని, సామాజిక న్యాయం, తెలంగాణ ఉద్యమకారుల గుర్తింపు వంటి హామీలను ఆ పార్టీ నెరవేర్చలేకపోయిందని కవిత విమర్శించారు. ప్రాంతీయ భావజాలం నుంచి బీఆర్ఎస్ వైదొలగడం వల్లే ప్రజలకు దూరమైందని ఆమె అభిప్రాయపడ్డారు. ప్రస్తుతం కాంగ్రెస్ పార్టీయే తమ ప్రధాన ప్రత్యర్థి అని, బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలు స్లీప్ మోడ్‌లోకి వెళ్లిపోయాయని ఆమె వ్యాఖ్యానించారు. ఇక ఢిల్లీ మద్యం కేసులో తనపై దిగువ కోర్టులో ఎలాంటి అభియోగాలు నమోదు కాలేదని, ఈడీ, సీబీఐ అప్పీళ్ల అంశాన్ని న్యాయవ్యవస్థకే వదిలేస్తున్నానని ఈ సందర్భంగా వెల్లడించారు.

## పోలవరం ముంపుపై కేంద్రం కీలక లేఖ

మొదటిపేజీ తరువాయి – (వెనక్కి తన్నే నీరు) ముంపు సమస్యపై ఒక కీలక పరిణామం చోటుచేసుకుంది. బీఆర్ఎస్ ప్రతినిధి బృందం సమర్పించిన వినతిపత్రంపై కేంద్ర ప్రభుత్వ పరిధిలోని ‘పోలవరం ప్రాజెక్ట్ అథారిటీ’ (పీపీఏ) సానుకూలంగా స్పందిస్తూ రాతపూర్వక హామీ ఇచ్చింది. ఈ లేఖకు సంబంధించిన వివరాలను మాజీ మంత్రి, బీఆర్ఎస్ నేత హరీశ్ రావు ఎక్స్ వేదికగా పంచుకున్నారు. పోలవరం ప్రాజెక్ట్ పూర్తి స్థాయి నీటి మట్టం కారణంగా తెలంగాణ పరిధిలో ముంపునకు గురయ్యే ప్రాంతాలను రెండు విధాలుగా ఆదుకుంటామని అథారిటీ స్పష్టం చేసింది. ఒకటి.. తగిన ఇంజనీరింగ్ పనుల ద్వారా ఆయా గ్రామాలకు ముంపు ముప్పు లేకుండా రక్షించడం. రెండు.. అది సాధ్యం కాకపోతే పునరావాస–పునర్నిర్మాణ చట్టం కింద ఆ భూములను సేకరించి రైతులకు పక్కా నష్టపరిహారం అందించడం. 2025 ఏప్రిల్ 8న జరిగిన అంతర్రాష్ట్ర సమావేశ నిర్ణయాలకు తాము కట్టుబడి ఉన్నామని పీపీఏ తెలిపింది. గోదావరి బేసిన్ పరిధిలోని తెలంగాణ ప్రజల జీవనోపాధిని, గిరిజనుల వ్యవసాయ భూములను కాపాడటానికి శాస్త్రీయ అంచనాలు, సమగ్ర వరద నివారణ చర్యలు తీసుకుంటామని లేఖలో పునరుద్ఘాటించింది. తెలంగాణ ప్రజల ప్రాణాలకు, ప్రయోజనాలకు అత్యున్నత ప్రాధాన్యత ఇస్తామని పేర్కొంది. ఈ నేపథ్యంలో... కేంద్ర ప్రభుత్వం ముంపు ఆందోళనలను అధికారికంగా గుర్తించి, రక్షణకు హామీ ఇవ్వడాన్ని తాము స్వాగతిస్తున్నామని హరీశ్ రావు తెలిపారు. అయితే, ఈ హామీలు కేవలం ఆఫీసు ఫైళ్లకే పరిమితం కాకుండా గ్రౌండ్ లెవెల్‌లో సకాలంలో అమలు కావాలని ఆయన విజ్ఞప్తి చేశారు. తెలంగాణ సరిహద్దు ప్రజల భద్రత, రైతుల ఉపాధి విషయంలో ఎలాంటి రాజీ పడే ప్రసక్తే లేదన్నారు. కేంద్రం, పీపీఏ, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం మూడు కలిసి సమన్వయంతో వ్యవహరించి, ప్రభావితమయ్యే ప్రతి కుటుంబానికి పూర్తి న్యాయం జరిగేలా చూడాలని డిమాండ్ చేశారు.

## ట్రంప్ ఎదుటే నావికుల భద్రతపై గళమెత్తిన మోదీ

మొదటిపేజీ తరువాయి – నావికుల భద్రత అంశాన్ని బలంగా ప్రస్తావించారు. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌తో సమావేశమైన సందర్భంగా, ఇటీవలే అమెరికా జరిపిన సైనిక దాడిలో ముగ్గురు భారతీయ నావికులు మరణించిన ఘటనను ఆయన పరోక్షంగా గుర్తుచేశారు. వేలాది మంది భారత నావికుల భద్రత తమకు అత్యంత ప్రాధాన్యత కలిగిన అంశమని, వారికి తగిన రక్షణ కల్పించాల్సిన ఆవశ్యకత ఉందని ఆయన స్పష్టం చేశారు. ఈ సందర్భంగా ఇరువురు నేతలు ద్వైపాక్షిక అంశాలపై చర్చలు జరిపారు. పశ్చిమాసియాలో శాంతి స్థాపన దిశగా జరుగుతున్న ప్రయత్నాలను ప్రధాని స్వాగతిస్తూనే, అక్కడి ఉద్రిక్తతల కారణంగా భారత పౌరులు ప్రాణాలు కోల్పోవడం పట్ల ఆవేదన వ్యక్తం చేశారు. “ప్రపంచ వాణిజ్యం కోసం దేశాలను అనుసంధానించే నావికుల భద్రత మనందరి ఉమ్మడి బాధ్యత. సముద్ర వాణిజ్య మార్గాలు సురక్షితంగా ఉండేలా చూస్తూ, వారు ఎటువంటి భయాందోళనలు లేకుండా విధులు నిర్వహించే వాతావరణాన్ని కల్పించాలి” అని మోదీ ఉద్ఘాటించారు. హర్మూజ్ జలసంధిని తెరిచి ఉంచడం వల్ల ప్రపంచ ఆర్థిక వ్యవస్థకు ఎంతో మేలు జరుగుతుందని ప్రధాని పేర్కొన్నారు. ఇరు దేశాల మధ్య త్వరలోనే కీలకమైన వాణిజ్య ఒప్పందం కుదిరే అవకాశం ఉందని ఆయన వెల్లడించారు. హర్మూజ్ జలసంధి వద్ద ఎటువంటి ఆంక్షలు ఉండకూడదని, అక్కడ స్వేచ్ఛా వాణిజ్యం నిరంతరాయంగా కొనసాగాలని ఆయన ఆకాంక్షించారు. ఇటీవల ఒమన్ సమీపంలో ఒక వాణిజ్య నౌకపై అమెరికా జరిపిన సైనిక దాడిలో భారతీయ సిబ్బంది మరణించిన ఘటనపై భారత్ ఇప్పటికే అమెరికాకు దౌత్యపరంగా తన నిరసనను తెలియజేసింది. ప్రపంచవ్యాప్తంగా లక్షలాది మంది భారతీయులు నావికులుగా సేవలందిస్తున్న నేపథ్యంలో, సంఘర్షణ ప్రాంతాల్లో వారి భద్రతపై తీవ్ర ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి.

## తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డికి థ్యాంక్స్ చెప్పిన ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్

మొదటిపేజీ తరువాయి – అరుదైన వ్యాధితో బాధపడుతున్న అభిమానిని పరామర్శించేందుకు ఆయన ఈరోజు వరంగల్ జిల్లా హనుమకొండకు వెళ్లారు. పర్యటన ముగిసిన అనంతరం, తనకు పూర్తి సహాయ సహకారాలు అందించిన తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి, రాష్ట్ర ప్రభుత్వానికి ఆయన ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు. ఈ మేరకు ఆయన సోషల్ మీడియా వేదికగా ఓ సుదీర్ఘ పోస్ట్ చేశారు.

### నిరంజన్ ఆకాంక్షను నెరవేర్చిన పవన్

కొన్ని రోజుల క్రితం హనుమకొండకు చెందిన నిరంజన్ అనే యువకుడు, తాను ఓ అరుదైన వ్యాధితో పోరాడుతున్నానని, తన అభిమాన నటుడు పవన్ కల్యాణ్‌ను కలవడమే తన కోరిక అని పేర్కొంటూ ఓ వీడియో విడుదల చేశాడు. ఆ వీడియో పవన్ దృష్టికి చేరింది. దీంతో వెంటనే స్పందించిన ఆయన, అభిమాని ఆకాంక్షను నెరవేర్చాలని నిర్ణయించుకున్నారు. ఇందులో భాగంగానే ఈరోజు నేరుగా హనుమకొండలోని నిరంజన్ నివాసానికి వెళ్లి పరామర్శించారు. తీవ్ర అనారోగ్యంతో బాధపడుతున్నప్పటికీ నిరంజన్ ప్రదర్శిస్తున్న ధైర్యం, ఆత్మవిశ్వాసం తనను ఎంతగానో కదిలించిందని పవన్ పేర్కొన్నారు. “అరుదైన వ్యాధితో చేస్తున్న పోరాటంలో నిరంజన్ అసాధారణ ధైర్యం, ప్రతికూల పరిస్థితులను ఎదుర్కొంటున్న తీరు ఎంతో స్ఫూర్తిదాయకం. అతని మనోధైర్యం ప్రశంసనీయం. నిరంజన్ సంపూర్ణ ఆరోగ్యంతో త్వరగా కోలుకోవాలని కలియుగ ప్రత్యక్ష దైవం శ్రీ వెంకటేశ్వరస్వామి వారిని ప్రార్థించాను. భద్రకాళి అమ్మవారి ఆశీస్సులు అతనికి ఎల్లప్పుడూ ఉండాలని కోరుకుంటున్నాను” అని పవన్ తన పోస్టులో వివరించారు.

### తెలంగాణ ప్రభుత్వానికి, ప్రజలకు ప్రత్యేక ధన్యవాదాలు

ఈ పర్యటనకు అవసరమైన అన్ని ఏర్పాట్లు చేసి, తనకు పూర్తి సహకారం అందించిన తెలంగాణ ప్రభుత్వానికి పవన్ కల్యాణ్ హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. “నా వరంగల్, హనుమకొండ పర్యటనకు పూర్తి సహాయ సహకారాలు అందించిన తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి, తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వానికి, పోలీసు శాఖలోని ఉన్నతాధికారుల నుంచి కానిస్టేబుల్ వరకు ప్రతి ఒక్కరికీ పేరుపేరునా కృతజ్ఞతలు తెలియజేస్తున్నాను” అని ఆయన పేర్కొన్నారు. అదే సమయంలో తెలంగాణ ప్రజలు తనపై చూపిస్తున్న ప్రేమ, ఆప్యాయతలకు ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలిపారు. వారి అభిమానం తనకు ఎల్లప్పుడూ స్ఫూర్తినిస్తుందని, వారి మమకారాన్ని జీవితాంతం తన హృదయంలో నిలుపుకొంటానని పవన్ భావోద్వేగంగా రాశారు. చివరగా “ప్రియమైన నిరంజన్.. నీ ధైర్యం నీ కష్టాలకంటే గొప్పది. త్వరలో నిన్ను సంపూర్ణ ఆరోగ్యంతో, చిరునవ్వుతో చూడాలని కోరుకుంటున్నాను” అంటూ అభిమానికి భరోసా ఇచ్చారు.

## విద్యతోనే జీవితాల్లో మార్పు

మొదటిపేజీ తరువాయి – కావచ్చని చెప్పారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదవడాన్ని ఎవరూ చిన్నతనంగా భావించవద్దని సూచించారు. రంగారెడ్డి జిల్లా ఆరుట్లలో తెలంగాణ పబ్లిక్ స్కూల్‌ను బుధవారం ప్రారంభించిన సీఎం అనంతరం విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడారు. ఈ పాఠశాల రాష్ట్రం మొత్తానికి స్ఫూర్తిగా నిలుస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. విద్యారంగానికి రాష్ట్ర ప్రభుత్వం ఏటా రూ.27 వేల కోట్లకు పైగా ఖర్చు చేస్తోందని తెలిపారు. గ్రామీణ ప్రాంతాల నుంచి ప్రపంచస్థాయి విద్యా సంస్థల వరకు పరిశీలించి విద్యా కమిషన్ ఛైర్మన్ ఆకునూరి మురళి సమగ్ర నివేదిక అందించారని చెప్పారు. దాని ఆధారంగానే తెలంగాణ పబ్లిక్ స్కూల్ల ఆలోచనకు రూపం ఇచ్చామని వివరించారు. నాణ్యమైన విద్య అందరికీ చేరాలన్న లక్ష్యంతో ఆరుట్ల గ్రామాన్ని ఎంచుకుని ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టినట్లు తెలిపారు. ఈ పాఠశాలలో ప్రవేశాల కోసం భారీ స్పందన రావడం సంతోషకరమని సీఎం పేర్కొన్నారు. ‘నో అడ్మిషన్స్’ బోర్డు పెట్టాల్సిన పరిస్థితి రావడం ఉపాధ్యాయుల కృషికి నిదర్శనమని అన్నారు. పాఠశాల సిబ్బందిని ప్రత్యేకంగా అభినందించారు. నిజాం పాలన, రజాకార్లకు వ్యతిరేకంగా పోరాడిన ఆరుట్ల రామచంద్రారెడ్డి, ఆరుట్ల కమలాదేవి వంటి మహనీయుల స్ఫూర్తి ఉన్న నేలపై ఈ కార్యక్రమాన్ని ప్రారంభించడం ఆనందంగా ఉందన్నారు. వారి పోరాట స్ఫూర్తి ఇక్కడి విద్యార్థుల్లోనూ కనిపిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. తన సొంత నియోజకవర్గంలో ఈ పాఠశాలను ప్రారంభించే అవకాశం ఉన్నప్పటికీ, ఆరుట్లను ఎంచుకోవడం వెనుక ఇదే కారణమని చెప్పారు. విద్యతో పాటు నైపుణ్యాలు కూడా అవసరమని సీఎం పేర్కొన్నారు. కేవలం చదువు మాత్రమే సరిపోదని, విద్యార్థుల్లో వృత్తి నైపుణ్యాలు పెరగాలని అన్నారు. అందుకే యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీని ఏర్పాటు చేశామని చెప్పారు. అక్కడ శిక్షణ పొందిన యువతకు ఉద్యోగ అవకాశాలు లభిస్తున్నాయని వెల్లడించారు. క్రీడల రంగంలోనూ తెలంగాణ మరింత ముందుకు వెళ్లాల్సిన అవసరం ఉందన్నారు. ఆరుట్ల విద్యార్థులు ఫుట్‌బాల్ అద్భుతంగా ఆడారని ప్రశంసించారు. క్రీడల్లో వెనుకబాటుతనాన్ని అధిగమించే బాధ్యత ప్రభుత్వం తీసుకుంటుందని హామీ ఇచ్చారు. ప్రపంచ ప్రఖ్యాత ఫుట్‌బాల్ క్రీడాకారుడు మెస్సీని హైదరాబాద్‌కు తీసుకువచ్చి యువ క్రీడాకారుల్లో స్ఫూర్తి నింపాలని ప్రయత్నించినట్లు తెలిపారు. త్వరలో యంగ్ ఇండియా స్పోర్ట్స్ యూనివర్సిటీని కూడా ప్రారంభిస్తామని వెల్లడించారు. సమాజంలో కులవివక్షను తగ్గించే దిశగా ఇంటిగ్రేటెడ్ స్కూల్స్‌ను తీసుకొస్తున్నామని సీఎం చెప్పారు. ప్రభుత్వ పాఠశాలల ద్వారానే గ్రామీణ ప్రాంతాల్లోని మట్టిలో మాణిక్యాలను వెలికితీయాలని సంకల్పించామని పేర్కొన్నారు. విద్యార్థులకు అత్యుత్తమ వసతులు, నాణ్యమైన విద్య అందేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. అంతకుముందు సీఎం రేవంత్ రెడ్డి పాఠశాల ప్రాంగణాన్ని పరిశీలించారు. విద్యార్థులతో కలిసి అల్పాహారం చేశారు. తరగతి గదులు, వసతి సౌకర్యాలు, ఇతర ఏర్పాట్లను పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. విద్యార్థులు, ఉపాధ్యాయులతో ముచ్చటించి వారి అభిప్రాయాలు తెలుసుకున్నారు.

## ఇన్‌స్టాగ్రామ్‌లో మనమే తోపులం.. మోదీతో మెలోనీ సరదా వ్యాఖ్యలు

మొదటిపేజీ తరువాయి – ‘మెలోడి’ ట్రెండ్ మరోసారి తెరపైకి వచ్చింది. ఇన్‌స్టాగ్రామ్‌లో మనమే అత్యంత ఫేమస్ అంటూ మెలోనీ చేసిన సరదా వ్యాఖ్య ఇప్పుడు వైరల్‌గా మారింది. +7 సదస్సులో భాగంగా నేతలంతా సంప్రదాయంగా ‘ఫ్యామిలీ ఫోటో’ కోసం సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మోదీని కలిసిన మెలోనీ.. “మిమ్మల్ని మళ్లీ కలవడం సంతోషంగా ఉంది” అని పలకరించారు. దీనికి ప్రధాని మోదీ తమ ఆన్‌లైన్ పాప్యులారిటీని ఉద్దేశిస్తూ సరదాగా బదులిచ్చారు. దీంతో మెలోనీ నవ్వుతూ.. “అవును, మనం ఇన్‌స్టాగ్రామ్‌లో చాలా ఫేమస్” అని అన్నారు. ఈ సరదా సంభాషణకు సంబంధించిన వీడియో సోషల్ మీడియాలో విస్తృతంగా చక్కర్లు కొడుతోంది. గతంలో రోమ్‌లో జరిగిన సమావేశంలో మోదీ.. మెలోనీకి ‘మెలోడీ’ చాక్లెట్ల ప్యాకెట్‌ను బహుమతిగా ఇచ్చారు. ఆ వీడియోను “హలో ఫ్రం ది మెలోడి టీమ్” అనే క్యాప్షన్‌తో మెలోనీ షేర్ చేయడంతో, అది కొన్ని గంటల్లోనే వైరల్ అయింది. నెటిజన్లు ఇద్దరి పేర్లను కలిపి ‘మెలోడి’ అని పిలవడం మొదలుపెట్టారు. తాజా ఘటనతో ఈ ట్రెండ్‌కు మళ్లీ జీవం వచ్చినట్టయింది. ప్రపంచ ఆర్థిక వృద్ధి, అంతర్జాతీయ భాగస్వామ్యాలు వంటి కీలక అంశాలపై చర్చించేందుకు ఫ్రాన్స్ +7 సదస్సును నిర్వహిస్తోంది. ఈ సదస్సుకు ప్రధాని మోదీ ప్రత్యేక అతిథిగా హాజరయ్యారు. అంతర్జాతీయ వేదికలపై ఇలాంటి స్నేహపూర్వక సంభాషణలు దౌత్య సంబంధాలకు మానవీయ కోణాన్ని జోడిస్తాయని నెటిజన్లు కామెంట్లు చేస్తున్నారు.

## ఎంపీల ఫోన్లు స్విచ్చాఫ్.. ‘ఉద్ధవ్ సేన’లో తిరుగుబాటు ఆందోళన!

మొదటిపేజీ తరువాయి – నేతృత్వంలోని శివసేన (యూబీటీ)లో తిరుగుబాటు సంకేతాలు కనిపిస్తున్నాయి. పార్టీకి చెందిన పలువురు లోక్‌సభ సభ్యులు ఏక్‌నాథ్ షిండే నేతృత్వంలోని శివసేనతో సంప్రదింపులు జరుపుతున్నారన్న ప్రచారం జోరందుకుంది. పశ్చిమ బెంగాల్‌లో తృణమూల్ కాంగ్రెస్ ఎంపీలు, ఎమ్మెల్యేల తిరుగుబాటు పర్వం మరవకముందే ఈ పరిణామాలు తెరపైకి రావడం దేశ రాజకీయాల్లో సంచలనంగా మారింది. పార్టీ సీనియర్ నేతలు సంప్రదించేందుకు ప్రయత్నించినప్పటికీ కొందరు ఎంపీల ఫోన్లు స్విచ్చాఫ్‌గా ఉండటంతో ఉద్ధవ్ వర్గంలో ఆందోళన నెలకొంది. పరిస్థితిని చక్కదిద్దేందుకు ఉద్ధవ్ ఠాక్రే స్వయంగా రంగంలోకి దిగినట్లు సమాచారం. విశ్వసనీయ వర్గాల సమాచారం ప్రకారం యూబీటీకి చెందిన సంజయ్ దినా పాటిల్, సంజయ్ దేశ్‌ముఖ్, నగేశ్ పాటిల్ అష్టికర్, ఓంరాజే నింబాల్కర్, భౌసాహెబ్ వక్చౌరే, సంజయ్ జాధవ్ తదితరులు షిండే వర్గంతో సంప్రదింపులు జరుపుతున్నారు. మరో ఎంపీ రాజాభౌ వాజే పేరు కూడా వినిపిస్తోంది. ఈ ఎంపీలు ఢిల్లీలో షిండే వర్గానికి చెందిన లోక్‌సభ సభ్యుడు శ్రీకాంత్ షిండే నివాసంలో సమావేశమయ్యే అవకాశమున్నట్లు తెలుస్తోంది. అనంతరం లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లాను కలిసి ప్రత్యేక పార్లమెంటరీ వర్గం ఏర్పాటు ప్రక్రియను పూర్తి చేసి, తర్వాత షిండే నేతృత్వంలోని శివసేనలో విలీనం కావచ్చున్న ఊహాగానాలు వినిపిస్తున్నాయి. తిరుగుబాటు నేతలను స్వాగతిస్తామని మహారాష్ట్ర మంత్రి ప్రతాప్ సార్నాయక్ ప్రకటించడం రాజకీయ చర్చకు దారితీసింది. బాల్ ఠాక్రే సిద్ధాంతాలను నమ్మి ఏక్‌నాథ్ షిండే నాయకత్వంపై విశ్వాసం ఉంచేవారికి శివసేన తలుపులు ఎప్పుడూ తెరిచే ఉంటాయని ఆయన వ్యాఖ్యానించారు. మరోవైపు యూబీటీ నేత సంజయ్ రౌత్ మాత్రం తిరుగుబాటు వార్తలను ఖండించారు. పార్టీ ఎంపీలంతా ఉద్ధవ్ ఠాక్రేతోనే ఉన్నారని స్పష్టం చేశారు. ఎంపీలను కొనుగోలు చేసేందుకు ఒక్కొక్కరికీ రూ.15 కోట్ల చొప్పున అడ్వాన్స్‌లు ఇస్తున్నారని ఆరోపించారు. అయితే పార్టీ చీలికపై వస్తున్న వార్తలను యూబీటీ నేతలు కొట్టిపారేస్తుండగా ఢిల్లీలో జరగనున్న సమావేశాలపై

## ‘ఒప్పందం నచ్చకపోతే మళ్లీ బాంబులేస్తాం’.. ఇరాన్‌కు ట్రంప్ హెచ్చరిక



మొదటిపేజీ తరువాయి – డొనాల్డ్ ట్రంప్ చేసిన వ్యాఖ్యలు చర్చనీయాంశంగా మారాయి. ఒప్పంద ముసాయిదా తనకు నచ్చకపోతే ఇరాన్‌పై మళ్లీ దాడులు ప్రారంభిస్తామని హెచ్చరించారు. దీంతో ఇప్పటికే సున్నితంగా ఉన్న పశ్చిమాసియా పరిస్థితులపై మరోసారి దృష్టి కేంద్రీకృతమైంది. ఫ్రాన్స్‌లో జరిగిన జీ7 సదస్సు సందర్భంగా ఈజిప్ట్ అధ్యక్షుడు అబ్దెల్ ఫతా అల్ సిసితో కలిసి మీడియాతో మాట్లాడిన ట్రంప్.. అమెరికా–ఇరాన్ మధ్య కుదరబోయే ఒప్పందం ఇంకా తుది రూపం దాల్చలేదని చెప్పారు. ప్రస్తుతం అది కేవలం అవగాహన ఒప్పందం మాత్రమేనని పేర్కొన్నారు. “ఆ ఒప్పందం నాకు నచ్చకపోతే మళ్లీ వారిపై కాల్పులు జరుపుతాం. వారి తలలపై బాంబులు వేయడం మొదలుపెడతాం” అంటూ ట్రంప్ ఘాటుగా వ్యాఖ్యానించారు. ఇరాన్ ప్రవర్తన సరిగా లేకపోయినా అదే పరిస్థితి ఎదురవుతుందని హెచ్చరించారు. ట్రంప్ వ్యాఖ్యలు మళ్లీ అంతర్జాతీయ మీడియా దృష్టిని ఆకర్షించాయి

## క్షమాపణ చెప్పాలి, కోటి కట్టాలి.. స్టాలిన్‌కు టీవీకే నేత లీగల్ నోటీసు

మొదటిపేజీ తరువాయి – తనకు సంబంధం ఉందంటూ నిరాధార ఆరోపణలు చేశారంటూ తమిళగ వెట్రి కళగం (టీవీకే) నేత ఆదవ్ అర్జున.. రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి, డీఎంకే అధినేత ఎంకే స్టాలిన్‌కు, డీఎంకే ఐటీ వింగ్‌కు లీగల్ నోటీసు పంపారు. 48 గంటల్లోగా బహిరంగ క్షమాపణ చెప్పాలని, లేనిపక్షంలో చట్టపరమైన చర్యలు ఎదుర్కోవాల్సి వస్తుందని హెచ్చరించారు. డైరెక్టరేట్ ఆఫ్ రెవెన్యూ ఇంటెలిజెన్స్ (డీఆర్ఐ) అరెస్ట్ చేసిన జాన్ బ్రిట్టో అనే వ్యక్తితో తనకు సంబంధాలు అంటగడుతూ డీఎంకే, దాని అనుబంధ విభాగాలు సోషల్ మీడియాలో దుష్ప్రచారం చేస్తున్నాయని ఆదవ్ అర్జున తన నోటీసులో ఆరోపించారు. ఈ నిరాధారమైన, కల్పితమైన ఆరోపణల వల్ల తన ప్రతిష్ఠకు తీవ్ర భంగం వాటిల్లిందని, తాను మానసిక వేదనకు గురయ్యానని పేర్కొన్నారు. ఎలాంటి ఆధారాలు లేకుండానే తనను నేర కార్యకలాపాలతో ముడిపెట్టే ప్రయత్నం చేశారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో డీఎంకే ఐటీ వింగ్‌తో పాటు ఎంకే స్టాలిన్ కూడా తనకు బేషరతుగా బహిరంగ క్షమాపణ చెప్పాలని ఆదవ్ అర్జున డిమాండ్ చేశారు. నోటీసు అందుకున్న 48 గంటల్లోగా ఈ ప్రక్రియ పూర్తి చేయాలని గడువు విధించారు. క్షమాపణతో పాటు తన పరువుకు కలిగించిన నష్టానికి, మానసిక క్షోభకు గాను రూ. 1 కోటి పరిహారంగా చెల్లించాలని కూడా నోటీసులో కోరారు తాను నిర్దేశించిన గడువులోగా క్షమాపణ చెప్పి, పరిహారం చెల్లించడంలో విఫలమైతే.. స్టాలిన్‌తో పాటు ఈ ఆరోపణల వ్యాప్తికి కారణమైన ప్రతి ఒక్కరిపైనా సివిల్, క్రిమినల్ చర్యలు తీసుకుంటానని ఆదవ్ అర్జున స్పష్టం చేశారు. ఈ లీగల్ నోటీసుతో తమిళనాట డీఎంకే, నూతనంగా ఏర్పాటైన టీవీకే మధ్య రాజకీయ ఘర్షణ మరింత ముదిరినట్టయింది. ఈ వివాదం రాబోయే రోజుల్లో న్యాయపోరాటానికి దారితీసే అవకాశాలు కనిపిస్తున్నాయి.

## ఇరాన్ ఎంవోయూ ఫైనల్ కాదు



### డీల్ నచ్చకపోతే మళ్లీ బాంబులేస్తాం

### జీ7 సదస్సులో ట్రంప్ వ్యాఖ్యలు

అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ అనూహ్య ప్రవర్తన మరోసారి బయటపడింది. ఇరాన్‌తో యుద్ధం ముగించడానికి కుదుర్చుకున్న అవగాహన ఒప్పందం(ఎంవోయూ) అంతిమం కాదని ట్రంప్ ప్రకటించారు. ఇరాన్ సరిగ్గా ప్రవర్తించకపోతే మళ్లీ బాంబు దాడులు ప్రారంభించవలసి వస్తుందని ఆయన హెచ్చరించారు. స్విట్జర్లాండ్‌లో అవగాహన ఒప్పందంపై అమెరికా, ఇరాన్ అధికారికంగా సంతకం చేయడానికి రెండు రోజుల ముందు ఫ్రాన్స్‌లో జరుగుతున్న జీ7 శిఖరాగ్ర సమావేశంలో ట్రంప్ నుంచి ఈ ఘాటైన వ్యాఖ్యలు రావడం ఒప్పందం బలహీనతను సూచిస్తున్నది. ఇది తుది ఒప్పందం కాదు. కేవలం ఒక అవగాహన ఒప్పందం మాత్రమే. ఒకవేళ ఇది నాకు నచ్చకపోయినా లేదా వారు (ఇరాన్) సరిగ్గా ప్రవర్తించకపోయినా మేము వెంటనే వారి నెత్తి మీదే బాంబులు వేసే స్థితికి తిరిగి వెళతాము. ఎందుకంటే గత 47 ఏండ్లుగా వారు దుర్మార్గంగా ప్రవర్తిస్తూనే ఉన్నారు అని ట్రంప్ వ్యాఖ్యానించారు.

### ఒబామాపై విమర్శలు

జీ7 సమావేశం కోసం ఫ్రాన్స్‌లో అడుగుపెట్టినప్పటి నుండి తన ఇరాన్ ఒప్పందం గురించి గొప్పగా చెప్పుకోవడం ఆపని ట్రంప్ కొందరు మూర్ఖులు కోరుకున్న ప్రపంచవ్యాప్త ఆర్థిక మాంద్యాన్ని తాను అడ్డుకున్నానని చెప్పారు. అయితే ఆ మూర్ఖులెవరో ఆయన నేరుగా పేర్లు వెల్లడించలేదు. ఇరాన్‌తో ఒప్పందాన్ని మాజీ అధ్యక్షుడు బరాక్ ఒబామాసహా తాను తప్ప ఎవరూ సాధించలేకపోయేవారని ట్రంప్ పేర్కొన్నారు. ఇరాన్ విషయంలో ఒబామా అనేక వందల కోట్ల డాలర్లు ఖర్చు చేసినప్పటికీ విఫలమయ్యారని కూడా ఆయన వ్యాఖ్యానించారు. ఈ సందర్భంగా ఒబామా పై అసభ్య పదజాలాన్ని కూడా ట్రంప్ ప్రయోగించారు.

### యుద్ధంలో గ్రోక్‌ను వాడిన యూఎస్

ఇరాన్‌తో యుద్ధంలో అమెరికా ఎక్స్ ఏఐ చాట్ బాట్ గ్రోక్‌ను వాడటం సంచలనంగా మారింది. ఈ విషయాన్ని స్వయంగా పెంటగాన్ ఏఐ, డిజిటల్ చీఫ్ కామెరాన్ స్టాన్లే తెలిపారు. గ్రోక్ సాయంతో ఇరాన్ మీద 96 గంటల్లో 2వేలకు పైగా మిస్సైళ్లను విజయవంతంగా వేసి పలు లక్ష్యాలను ధ్వంసం చేసినట్టు ఆయన చెప్పారు.

### ఇరాన్ వద్ద అణుబాంబు కన్నా శక్తివంతమైన ఆయుధం!

పశ్చిమాసియాలో ఘర్షణ మొదలై ఆ తర్వాత అమెరికాతో కాల్పుల విరమణ ఒప్పందం కుదిరి మూడు నెలలు దాటిన తరుణంలో అణ్వాయుధం కన్నా శక్తివంతమైన ఒక ఆయుధాన్ని ఇరాన్ సమకూర్చుకుంది. కీలకమైన హొర్ముజ్ జలసంధిని తన ఇష్టారీతిన మూసివేసే శక్తి ఇరాన్‌కు ఉందని అమెరికా నిఘా సంస్థలు బుధవారం హెచ్చరించాయి. అమెరికాతో కుదుర్చుకోనున్న శాంతి ఒప్పందంతో సంబంధం లేకుండా ప్రపంచ ఆర్థిక వ్యవస్థను అస్తవ్యస్తం చేసే ఇరాన్ సామర్థ్యం మళ్లీ పెరగవచ్చని నిఘా సంస్థల అంచనాను ఉటంకిస్తూ సీఎన్ఎన్ వార్తాసంస్థ తెలిపింది. హొర్ముజ్ జలసంధిపై వాస్తవ నియంత్రణను ఇప్పుడు మనం ఇరాన్‌కు అప్పగించాము. ఇది అణ్వాయుధం కన్నా చాలా శక్తివంతమైన ఆయుధం అని ఆ వర్గాలు వార్తాసంస్థకు తెలిపాయి.

## తుమ్మెద రెక్కల మీద మువ్వన్నెవిల్లుల ఆకాశం





1. ఏ పాలపుంతల్ని దాటొచ్చావో కానిఇంతకుముందెన్నడూ మేమెరుగని పిల్లనగ్రోవులపంటవు నువ్వు. లోకం వెంట లోకాన్ని దించి మాకు పల్లకీలు కట్టించిన మెరుపులచెండువు నువ్వు... మడతలు విప్పుకున్న పద్యాలుగా మమ్మ విప్పార్చిన మొగలీసంపెంగల మహోత్సవానివి కదూ నువ్వు

2. ఆ అనిమేష వీక్షణాల నిండా విరగబూచే తీగ సంపెంగల పందిరి పరిచి ఆ పందిళ్ల నిండా నన్నొక చిన్నిచిన్ని పిట్టలగుంపును చేసి%– తీరొక్కరాగాల కోలాటాలాడించి పాడడమే ఎరుగని నన్నెంత మహాగాయకుణ్ణి చేసి ఆహా.. ఎన్ని కచేరీలు చేయిస్తున్నావో

3. నీ ఆ పెదవి అంచున విరుపులో దోగాడే పసిసిగ్గు వేలవేల కలువరాయళ్లను దూసిపోస్తూ ఆకాశాల్ని అరచేతికందిస్తుంటే కొత్తపాటల్ని కట్టుకుంటూ ఎన్నిసార్లు కొత్తమొదళ్లమైపోతున్నా ఎఇంకేదో వెలితిలో ఈ చిన్నిగుండెల్ని జోలెలుగా పట్టి నీ కనురెప్పలవాకిట భిక్షకులం కావడం ఎంతటి మహదానందంగా ఉందో

4. నువ్వే దేవభాషను మాట్లాడుతుంటావో తెలీదుకానీ నీతో సంభాషించడానికి మా వర్ణమాలనంతా మరచిపోయి లిపికందని ఏదో మధురభాషతో నీతో పోటీపడుతున్నా నీ కేరింతలు, ఉంగా, ఊ లతో దేహాన్నంతా చిత్రభాషగా మలచి చిత్తుగా ఓడించేస్తుంటే మనసును చెంగుపట్టి రోజూ వంద ఓటముల్ని ఎత్తుకోవడానికైనా మేం తయారే.

5. ఈ ప్రపంచమింకా బతికుందనడానికి ఈ నేల ఇంకా నవ్వుతూనే ఉందనడానికి ఈ గాలి ఇంకా కలల తొక్కిసలాటలో పండుతూనే ఉందనడానికి కాలం ఇంకా మమ్మల్ని పలకరిస్తూనే ఉందనడానికి ఒకే ఒక్క నిదర్శనం చివుళ్లుతొడిగే కొత్తలోకాల్ని కుక్కి కుక్కి మోసుకొచ్చిన ను.. వ్వే.. గా.

6. మేమూ, కాలం అదిగో ఆ రైలుపట్టాల్లా ఎప్పుడూ ఎడమెడమే అదిగో అక్కడెక్కడో మలుపులో మా దూరాల్ని బద్ధలుకొడుతున్నట్లున్న ఆ దవ్వుల్లో– ఇప్పటికైతే– మా జుగల్‌బందీకి వేదికా నువ్వే , వాద్యమూ నువ్వే గాత్రమూ నువ్వే, గానమూ నువ్వే ముగింపన్నదే లేని కచేరీ నువ్వే

7. ఇసుకకొండల్లా ఎండకాగుతున్న మమ్మల్ని మళ్లీ నదుల్ని చేసిన చిలుకపాటల చిరుజలపాతం లాంటి నీ జలతారునవ్వులు, నేరుగా చందమామలోంచి రా సెలయేళ్లలో ఈత కొట్టొచ్చిన సమీరాల్లాంట నీ తేనెచూపులు తుంచిపోస్తున్న కాశ్మీరాల్లో తూలీ, సోలీ చుక్కల్ని కోసుకున్న మైకంలో– ఓ కొండపల్లిబొమ్మా.. నీకెంత కవిత్వాన్ని బాకీ పడిపోతున్నానో! –యార్లగడ్డ రాఘవేంద్రరావు.

## కొబ్బరి నీళ్లు ఎన్ని తాగాలి?



కొబ్బరి నీళ్లు ఆరోగ్యానికి మేలని అందరికీ తెలిసిందే. ఎవరికైనా చిన్న ఆరోగ్య సమస్య వచ్చినా కొబ్బరి నీళ్లు తాగమని సలహా ఇస్తుంటారు. రోగాలతో ఉన్నవాళ్లకే కాదు ఆరోగ్యంగా ఉన్నవాళ్లకూ ఇందులో ఉండే పోషకాలు అవసరమే. అయితే, అధికంగా పోషకాలు ఉండే కొబ్బరి నీళ్లను ఎన్ని తాగాలి? ఎన్నిసార్లు తాగాలో అవగాహన తక్కువే! పరిమితిని మించితే ఔషధం కూడా వికటిస్తుంది. ఎక్కువ మోతాదులో లవణాలు ఉండే కొబ్బరి నీళ్లను పరిమితంగా తాగడమే మేలని చెబుతున్నారు నిపుణులు. కొందరైతే.. కొబ్బరినీళ్లు లీటర్ బాటిల్ కొని గటగటా తాగేస్తుంటారు. ఇంకొందరు రెండుసార్లు విరామం ఇస్తూ లీటర్ పట్టిస్తారు. అన్నేసి కొబ్బరినీళ్లు తాగితే.. కిడ్నీలు, ఇతర అవయవాలపై భారం పడుతుందని వైద్యులు హెచ్చరిస్తున్నారు. ఒకసారి 150–200 మిల్లీలీటర్లు తాగితే సరిపోతుందని సలహా ఇస్తున్నారు. ఆరోగ్యవంతులు వారంలో మూడు నుంచి నాలుగుసార్లు కొబ్బరినీళ్లు తాగొచ్చు. అది కూడా ఉదయం, సాయంత్రాల్లో శారీరక శ్రమ చేసిన తర్వాత లేదా వ్యాయామం ముగించిన తర్వాత కొబ్బరి నీళ్లు తాగడం మేలు! కొబ్బరి నీళ్లలో ఉండే పొటాషియం రక్తపీడనాన్ని నియంత్రణలో ఉంచుతుంది. శరీరానికి కావాల్సిన గ్లూకోజ్‌ను వేగంగా అందిస్తుంది. కాళ్ల తిమ్మిర్లు

## రోజుకు అసలు ఎన్ని కప్పుల గ్రీన్ టీని తాగాలి.. ఏ సమయంలో తాగితే మంచిది..?



ఆరోగ్యంగా ఉండాలని చెప్పి ప్రస్తుతం చాలా మంది గ్రీన్ టీని సేవిస్తున్నారు. ప్రపంచ వ్యాప్తంగా చాలా మంది గ్రీన్ టీని అధికంగా తాగుతుంటారు. చైనా సంప్రదాయ వైద్యంలోనూ గ్రీన్ టీని తాగమని సూచిస్తుంటారు. గ్రీన్ టీలో అనేక సమ్మేళనాలు ఉంటాయి. ఇవి మనకు ఆరోగ్యకరమైన ప్రయోజనాలను అందిస్తాయి. గ్రీన్ టీని రోజూ తాగడం వల్ల పలు వ్యాధులు సైతం నయమవుతాయి. అయితే గ్రీన్ టీ తాగుతాం, బాగానే ఉంటుంది, కానీ రోజుకు ఎన్ని కప్పులు తాగాలి, ఏ సమయంలో తాగాలి.. అని చాలా మంది సందేహిస్తుంటారు. ఇందుకు పోషకాహార నిపుణులు ఏమని సమాధానాలు చెబుతున్నారో ఇప్పుడు తెలుసుకుందాం. గ్రీన్ టీ అనేది ఎవరి ఆరోగ్య స్థితిని బట్టి వారు తాగాల్సి ఉంటుంది. కొందరు ఎక్కువ కప్పులు తాగినా పెద్దగా ప్రభావం ఉండదు. కొందరు ఒక కప్పు కూడా తాగలేకపోతారు. కనుక అలాంటి వారు గ్రీన్ టీకి దూరంగా ఉండడమే మంచిది.

**3 కప్పుల వరకు..**

సాధారణంగా ఎవరైనా సరే రోజుకు 1 నుంచి 3 కప్పుల వరకు గ్రీన్ టీని తాగవచ్చని ఆరోగ్య నిపుణులు చెబుతున్నారు. దీని వల్ల గుండె పోటు రాకుండా గుండె ఆరోగ్యంగా ఉంటుంది. పలు అధ్యయనాలు చెబుతున్న ప్రకారం రోజుకు 3 కప్పుల వరకు గ్రీన్ టీని సేవిస్తుంటే క్యాన్సర్లు వచ్చే అవకాశాలు గణనీయంగా తగ్గుతాయని తేలింది. మెదడు ఆరోగ్యంగా ఉంటుంది. షుగర్ లెవల్స్ నియంత్రణలో ఉంటాయి. టైప్ 2 డయాబెటిస్ ఉన్నవారికి మేలు జరుగుతుంది. ఒక కప్పు గ్రీన్ టీలో సాధారణంగా 50 మిల్లీగ్రాముల వరకు కెఫీన్ ఉంటుంది. అమెరికాకు చెందిన ఎఫ్‌డీఏ చెబుతున్న ప్రకారం ఒక వ్యక్తి రోజుకు 400 మిల్లీగ్రాములకు మించి కెఫీన్‌ను తీసుకోకూడదు. అంటే 8 కప్పుల వరకు గ్రీన్ టీ తాగవచ్చని అర్థం వస్తుంది. కానీ ఒక వ్యక్తి రోజుకు 8 కప్పుల వరకు గ్రీన్ టీని సేవించలేరు. కనుక 3 కప్పులకు పరిమితం చేస్తే మంచి ఫలితాలు ఉంటాయని నిపుణులు చెబుతున్నారు.


**ఈ సమయంలో అయితే..**


ఇక గ్రీన్ టీని రోజులో ఏ సమయంలో సేవించాలని కూడా చాలా మంది సందేహిస్తుంటారు. గ్రీన్ టీని ఆహారం తినడానికి 1 గంట ముందు లేదా గంట తరువాత తాగాలి. లేదంటే మనం తిన్న ఆహారంలో ఉండే ఐరన్, విటమిన్ సి వంటి పోషకాలను శరీరం సరిగ్గా శోషించుకోలేదు. కనుక బ్రేక్ ఫాస్ట్ చేశాక గంట సేపు ఆగి తాగితే మంచిది. మధ్యాహ్నం లంచ్ అయ్యాక 1 గంట విరామం ఇచ్చి కూడా తాగవచ్చు. రాత్రి పూట మాత్రం సేవించకూడదు. ఇందులో ఉండే కెఫీన్ కారణంగా నిద్ర పట్టదు. రాత్రి పూట గ్రీన్ టీని తాగితే నిద్రకు ఆటంకం కలుగుతుంది. ఇలా గ్రీన్ టీని తాగితే అనేక లాభాలను పొందవచ్చు. గ్రీన్ టీని తాగడం వల్ల యాంటీ ఆక్సిడెంట్లు సమృద్ధిగా లభిస్తాయి. ఇవి ఫ్రీ ర్యాడికల్స్‌ను నిర్మూలించి గుండె పోటు, క్యాన్సర్ వంటి వ్యాధులు రాకుండా చూస్తాయి.

**లాభాలు ఇవే..**

గ్రీన్ టీలో ఉండే కెఫీన్, ఎల్–థియానైన్ అనే అమైనో యాసిడ్ కారణంగా మెదడు ఉత్తేజంగా మారుతుంది. చురుగ్గా ఉంటారు. ఉత్సాహంగా పనిచేస్తారు. బద్ధకం పోతుంది. నిద్ర మత్తు వదిలిపోతుంది. ఏకాగ్రత, జ్ఞాపకశక్తి పెరుగుతాయి. మెదడు యాక్టివ్‌గా పనిచేస్తుంది. గ్రీన్ టీని సేవించడం వల్ల మెటబాలిజం పెరుగుతుంది. దీంతో క్యాలరీలు ఖర్చవుతాయి. కొవ్వు కరుగుతుంది. అధిక బరువు తగ్గుతారు. బరువు తగ్గాలనే ప్రయత్నంలో ఉంటే రోజూ గ్రీన్ టీని తాగుతుంటే ఫలితం ఉంటుంది. గ్రీన్ టీలో పాలిఫినాల్స్ అధికంగా ఉంటాయి.

# సహస్ర వృత్తుల సమస్త చిత్రం





తలచుకోగానే ఎవరైనా కళ్లబడితే వారికి 'నిండు నూరేళ్ళు' అంటాం. అట్లా కాపు రాజయ్యకి నిండు ఆయుర్దాయం నేటికి నిండినదేమీ కాదు, మలిదశ తెలంగాణ ఉద్యమంలోనే వారి యాది సంపూర్ణం. శతాయువు మాత్రమే కాదు, వారు అనునిత్యం చిరంజీవి. అయితే ఇక ముందు వారి మరో అంకం సాగనుంది. అదే ఈ వ్యాసం సారాంశం. ఎవరైతే తమ గడుల్లో బలవంతంగా బతుకమ్మ ఆడించారో వారే బతుకమ్మ ఆడే స్థితి తెలంగాణ ఉద్యమం తేనే తెచ్చింది. వాళ్ళ మెడలు వంచి బతుకమ్మను, బోనాలను నెత్తిమీద పెట్టుకునేలా చేయనే చేసింది. అంతేకాదు, సకల జనుల సమిష్టి చేతనలోకి మన సాంస్కృతిక ఆనవాళ్ళు బలీయమై, ఉద్యమ ?సోయిలోకి వచ్చేసరికి మళ్ళీ సజీవ స్మృతిలోకి వచ్చి చేరిన రెండే రెండు బొమ్మలు, రాజయ్య గీసినవే. ఒకటి%–% సద్దుల బతుకమ్మ, రెండు బోనాలు, ఈ రెండు బొమ్మలు రాష్ట్ర పండుగలుగా అయ్యేనాటికి ఎంతో ముందు, అనేక దశాబ్దాల క్రితమే వారు ఆ ఉత్సవాలను అపురూపంగా పదిలపరిచారు. చిత్రమేమిటంటే, 'ఫక్తు రాజకీయాల దశ' పోయి 'ప్రజా పాలన' అని మూడో దఫా ప్రభుత్వం వచ్చేనాటికి తెలంగాణ తల్లి చేతుల్లో బతుకమ్మ మాయం అయి ఉండొచ్చు గాక. కానీ, ఆయన చేసిన పని అంతకుముందే పరిసమాప్తి అయింది. అవును, వారు చిత్రించి పెట్టిన ఆ రెండు బొమ్మలు చేయవలసిన పని చేశాయి. ఇప్పుడు మిగితావి కూడా బయలుపడతాయి. అదే శత జయంతి ఆన. నేటి (ఆగస్టు 3) సాయంత్రం హైదరాబాద్‌లోని చిత్రమయి స్టేట్ ఆర్ట్ గ్యాలరీలో కాపు రాజయ్య శత జయంతి ఉత్సవ సందర్భంగా కళా ప్రదర్శన ప్రారంభం. ఆగస్టు పది వరకూ ఉంటుంది. ఈ ప్రదర్శనలో బహుశా అనేక చిత్రాలు నూతన అంకురానికి ప్రేరేపణ ఇస్తాయనే నమ్ముతాను నేను. అవును, రాజయ్య సబ్బండ వర్ణాల చిత్రకారులు. వారు పండుగలు, పబ్బాలను మాత్రమే చిత్రించలేదు. నేడు బీసీ కుల గణన ద్వారా మొదటిసారిగా దేశవ్యాప్తంగా మెజారిటీ ప్రజగణన జరిగే తరుణం ఆసన్నమయ్యే సరికి వారు అసలైన ఉత్సవ రథాన్ని మన ముందుకు చేర్చనే చేర్చారు. ఆయన తీరొక్క కులాన్ని, వారి వ్యావృత్తులతో కూడి, కడు సుందరంగా ఎప్పుడో చిత్రించి ఉన్నారు. ఇకముందు వారి అన్ని చిత్రాలూ ఊరేగక మానవు. వెలికి తీయవలసిన సందర్భం ఇది. ఒక్క మాటలో భారతదేశ చిత్రకళా మండలంలోకి ఒకనాడు పరిపుష్టంగా తులతూగిన తెలంగాణ గ్రామాన్ని, అందలి మెజారిటీ కుల సముదాయాలను కాపు రాజయ్య ప్రతిక్షేపించి చూపినంత ఘనంగా మరొకరు చేయలేదు. వారు సహస్ర వృత్తుల సమస్త చిహ్నాలను ఉపరితల మానకంగా వేయలేదు. ఆయా వృత్తిదారులను వారి పనిపాటలే రక్తమాంసాలతో తమవైన అచ్చట్లు ముచ్చట్లతో తమవైన అలంకారాలతో ఒక కోలాటంగా చిత్రించి పెట్టారు. నేడు వాటిని చూడటం అంటే వాంఛితంగా నైరూప్యం చేసిన మెజారిటీ ప్రజల గ్రామీణ జీవన ఉత్సవాన్ని తిరిగి వాస్తవికంగా దర్శించడమే. అదే ఇప్పటి కవి సమయం లేదా చిత్రకళా పునరుజ్జీవన సందర్భం.

అనేకులకు వారి బతుకమ్మ, బోనాలతో పాటు రాజయ్య గీసిన రాధాకృష్ణుల చిత్రం తెలుసు. చాలామందికి తాటి చెట్టు ఎక్కుతున్న గౌడ్ తాలూకు 'రిస్కీ లైఫ్' తెలుసు. కానీ, వారి కాన్వాసు పెద్దది. అందులో కమ్మరి, కుమ్మరి, వడ్రంగి, బెస్త, స్వర్ణకారి, మేదరి, పద్మశాలీ, వడ్డెరలు, నకాషీలే కాదు, యాదవులు, దూదేకులు, రజకులు ఎందరో ఉన్నారు. పరమాత్మ, జీవాత్మలతో సహా ఇంకా ఎన్నో చిత్రించారు. నిజానికి వారు సహస్ర వృత్తుల సమస్త చిహ్నంగా చూపింది 'కళ'ను. అవును. కళే ఒక్కో కులానికి ఉన్న బహుజన ప్రజల అసలైన విద్యా ఉద్యోగ ఔపాధిక సంస్కృతి అని, అదే స్వరాజ్యం అని ఆయన చిత్రించారు. అదే రాజయ్య రాజరికం. నిజానికి బహుజన సమాజాన్ని, ఒక్కో సముదాయంగా తరతరాలుగా వారు చేపట్టి అభివృద్ధి చేసిన పనులను 'వృత్తులు' అనే చాలా మంది భావించారు. వాటిని 'హస్తకళలు' అనే మాట్లాడారు. కానీ రాజయ్య తన లలిత కళలో ఒక్కో కులాన్ని గొప్ప జీవకళగా అభివ్యక్తం చేసి చూపారు. ఒకరి చేతుల్లో ఒకరు చేయుంచి ఊరు ఉమ్మడిగా సకల కులాల సమ్మేళనంగా, తీరొక్క మనుషుల సమిష్టి జీవన గ్రామంగా ఆయన దేనికదే ఒక బొమ్మగా చిత్రించి పెట్టారు. అదే వారి 'కళా భవనం'. మరో మాటలో ఆయన గ్రామాన్ని తన జానపద చిత్తమూ చిత్రంతో పల్లకీ ఎక్కేలా చేశారు. ఆ బోయలే అందులో ఊరేగేలా చిత్రించారు. ధ్వంసం కాకముందరి గ్రామాన్ని, మనం కోల్పోయిన గ్రామ పునాదిని, అందలి నాగరికతలను వారు చూపినంత విశిష్టంగా ఇంతటి వైవిధ్యంతో దేశంలోనే మరే చిత్రకారుడూ చిత్రించలేదు. అందువల్లే రాజయ్య శత జయంతి ఉత్సవం ఒక్క తెలంగాణకు, తెలుగు రాష్టాలకు పరిమితం కారాదు, దేశంలోని బహుళ ప్రజానీకపు బతుకులకు ఈ వేడుక పునరుజ్జీవన కానుక. ఒక ఎరుక. గణన. అందుకే సరికొత్తగా అనడం, వారి కళ సహస్ర వృత్తుల సమస్త చిహ్నం అని. అది ఒకనాడు కేవలం బతుకమ్మ బొమ్మగానే కానవచ్చింది. కానీ నేడు వారి శత జయంతి సమయానికి, ఒక్కో కులానికి చెందిన వారి బొమ్మలన్నీ తీరొక్క పూల వంటి ఒక సాంస్కృతిక సమ్మేళనంగా, ఒక గణనీయమైన వైవిధ్యంగా మన ముందుకు వచ్చాయని. అదే దేనికదే నిజమైన 'బతుకమ్మ'. విభిన్న పండుగగా చూడాలి. ఇక వారి ఒక్కో బొమ్మను లెక్కించి చూడాలి. అదే వారికి మనమిచ్చే ఘనమైన నీరాజనం.

## మీకు ఈ నట్స్ గురించి తెలుసా..?

## రోజూ గుప్పెడు తినండి చాలు, ఎన్నో లాభాలను పొందవచ్చు..!



బాదంపప్పు, పిస్తా, జీడిపప్పు.. ఇలా చాలా రకాల నట్స్ గురించి మనకు తెలుసు. కానీ మీరు ఎప్పుడైనా టైగర్ నట్స్ గురించి విన్నారా..? వీటిని మీరు సూపర్ మార్కెట్లలో చూసే ఉంటారు. కానీ వీటి పేరు టైగర్ నట్స్ అని మీకు తెలిసి ఉండదు. ఇతర నట్స్ లాగే ఈ నట్స్ కూడా మనకు అందుబాటులో ఉన్నాయి. వీటిని కూడా మనం ఆహారంలో భాగం చేసుకోవచ్చు. టైగర్ నట్స్‌ను చుఫా లేదా ఎర్త్ ఆల్మండ్స్ అని పిలుస్తారు. అయితే ఇవి నట్స్ జాబితాకు చెందుతాయి. కానీ భూగర్భంలో పండుతాయి. ఈ నట్స్ మీద ముడతలు పడినట్లు తొక్క ఉంటుంది. ఇవి కాస్త తియ్యగా, క్రీమ్ రుచిని కలిగి ఉంటాయి. సాధారణ నట్స్ అంటే అలర్జీ ఉన్నవారు టైగర్ నట్స్‌ను తీసుకోవచ్చు. టైగర్ నట్స్‌ను రోజూ గుప్పెడు మోతాదులో తింటే అనేక లాభాలు కలుగుతాయని పోషకాహార నిపుణులు చెబుతున్నారు. ఈ నట్స్‌ను తింటుంటే పలు వ్యాధులు నయం అవుతాయని అంటున్నారు.

జీర్ణ వ్యవస్థ ఆరోగ్యానికి..

టైగర్ నట్స్‌లో ఫైబర్ అధికంగా ఉంటుంది. ఇది జీర్ణ వ్యవస్థను ఆరోగ్యంగా ఉంచుతుంది. పేగుల్లో మలం కదలికలు సరిగ్గా ఉండేలా చేస్తుంది. దీంతో మలబద్ధకం తగ్గుతుంది. ఈ నట్స్‌లో రెసిస్టెంట్ స్టార్చ్ ఉంటుంది. ఇది కూడా ఫైబర్ లాగే పనిచేస్తుంది. ఈ నట్స్‌ను తింటే ప్రీ బయోటిక్ ఆహారంగా పనిచేస్తాయి. దీని వల్ల జీర్ణ వ్యవస్థలో మంచి బ్యాక్టీరియా వృద్ధి చెందుతుంది. దీంతో జీర్ణ వ్యవస్థ పనితీరు మెరుగు పడుతుంది. టైగర్ నట్స్‌ను ఆహారంలో భాగం చేసుకుంటే జీర్ణ వ్యవస్థలో ఎంజైమ్‌ల ఉత్పత్తి మెరుగు పడుతుంది. ముఖ్యంగా అమైలేజ్, లైపేజ్, కాటలేజ్ అనే ఎంజైమ్‌లు ఉత్పత్తి అవుతాయి. ఇవి మనం తిన్న ఆహారాన్ని సులభంగా జీర్ణం అయ్యేలా చేస్తాయి. దీంతో గ్యాస్, కడుపు ఉబ్బరం, అజీర్తి తగ్గుతాయి.

గుండె సంరక్షణకు..

టైగర్ నట్స్‌ను తింటే మోనో అన్‌శాచురేటెడ్ కొవ్వులు లభిస్తాయి. ఇవి ఆరోగ్యకరమైన కొవ్వుల జాబితాకు చెందుతాయి. ఇవి శరీరంలో ఉండే చెడు కొలెస్ట్రాల్‌ను తగ్గిస్తాయి. మంచి కొలెస్ట్రాల్‌ను పెంచుతాయి. దీంతో గుండె ఆరోగ్యంగా ఉంటుంది. గుండె పోటు వచ్చే ప్రమాదం తగ్గుతుంది. టైగర్ నట్స్‌లో అర్జినైన్ అనే అమైనో యాసిడ్ ఉంటుంది. ఇది రక్త నాళాలను వెడల్పుగా చేస్తుంది. దీంతో రక్త సరఫరా మెరుగు పడుతుంది. దీని వల్ల బీపీ నియంత్రణలో ఉంటుంది. హైబీపీ ఉన్నవారు రోజూ ఈ నట్స్‌ను తింటుంటే ఎంతగానో ప్రయోజనం ఉంటుంది. బీపీని అదుపులో ఉంచుకోవచ్చు. ఈ నట్స్‌లో విటమిన్ ఇ, యాంటీ ఆక్సిడెంట్లు అధికంగా ఉంటాయి. ఇవి గుండెను, రక్త నాళాలను సంరక్షిస్తాయి. ఆక్సీకరణ ఒత్తిడి, వాపులను తగ్గిస్తాయి. దీంతో గుండె సురక్షితంగా ఉంటుంది.

డయాబెటిస్ ఉంటే..

టైగర్ నట్స్‌లో అధికంగా ఉండే ఫైబర్ కారణంగా తిన్న ఆహారంలో ఉండే పిండి పదార్థాలు రక్తంలో నెమ్మదిగా గ్లూకోజ్‌గా మారుతాయి. దీంతో షుగర్ లెవల్స్ నియంత్రణలో ఉంటాయి. ఈ నట్స్‌లో ఉండే ఆర్జినైన్ అనే సమ్మేళనం ఇన్సులిన్ ఉత్పత్తిని పెంచుతుంది. శరీరం ఇన్సులిన్‌ను మెరుగ్గా ఉపయోగించుకునేలా చేస్తుంది. దీని వల్ల షుగర్ లెవల్స్ తగ్గుతాయి. డయాబెటిస్ నియంత్రణలో ఉంటుంది. టైప్ 2 డయాబెటిస్ ఉన్నవారు ఈ నట్స్‌ను రోజూ తింటుంటే ఫలితం ఉంటుంది. టైగర్ నట్స్‌లో విటమిన్ సి, ఇ అధికంగా ఉంటాయి. అలాగే యాంటీ ఆక్సిడెంట్లు సైతం ఎక్కువగానే ఉంటాయి, ఇవి ఇన్ ఫెక్షన్లను తగ్గిస్తాయి. ఈ నట్స్‌లో అధికంగా ఉండే జింక్, ఐరన్ రోగ నిరోధక వ్యవస్థను పటిష్టంగా మారుస్తాయి. టైగర్ నట్స్‌లో యాంటీ బ్యాక్టీరియల్ గుణాలు ఉంటాయి. అందువల్ల ఈ నట్స్‌ను తింటే బ్యాక్టీరియా ఇన్ ఫెక్షన్లు తగ్గుతాయి. ఇలా టైగర్ నట్స్‌ను రోజువారి ఆహారంలో భాగం చేసుకోవడం వల్ల అనేక లాభాలను పొందవచ్చు.

## ట్రంప్‌కు తలొగ్గిన మోదీ సర్కార్!.. రష్యా నుంచి చమురు దిగుమతులు కట్!

**అమెరికా నుంచి రెట్టింపు స్థాయిలో కొనుగోళ్లు**

**ఏప్రిల్–జూన్ త్రైమాసికంలో 114 % పెరుగుదల**

**అయినా లెక్కచేయనిట్రంప్.. టారిఫ్ వాత**



అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ హెచ్చరికలకు లొంగిపోయిన కేంద్రంలోని నరేంద్ర మోదీ ప్రభుత్వం ఆయనను ప్రసన్నం చేసుకోవడానికి శతవిధాలా చేసిన ప్రయత్నాలు బెడిసికొట్టాయి. గత ఏప్రిల్‌లో ట్రంప్ చేసిన సుంకాల ప్రకటనతో బెదిరిపోయిన మోదీ ప్రభుత్వం అమెరికా నుంచి ముడి చమురు కొనుగోళ్లను రెట్టింపు చేసింది. ఏప్రిల్–జూన్ త్రైమాసికంలో అమెరికా నుంచి ముడి చమురు కొనుగోళ్లు 114 శాతం పెరగడం విశేషం. 2024 ఏప్రిల్, జూన్ మధ్య త్రైమాసికంలో అమెరికా నుంచి దాదాపు రూ. 15,000 కోట్ల విలువైన చమురును భారత్ కొనుగోలు చేసింది. 2025 ఏప్రిల్, జూన్ మధ్య ఈ మొత్తం రూ. 32,000 కోట్లకు చేరుకుందని వర్గాలు వెల్లడించాయి.

**ట్రంప్ రాకతో పెరిగిన కొనుగోళ్లు**

2025 జనవరి, జూన్ మధ్య అమెరికా నుంచి రోజుకు 2,71,000 బ్యారెళ్ల ముడి చమురును భారత్ కొనుగోలు చేసింది. 2024లో అదే కాలంలో రోజుకు 1,80,000 బ్యారెళ్ల ముడి చమురు కొనుగోలు జరిగింది. గత ఏడాదితో పోలిస్తే ఇది 51 శాతం పెంపును సూచిస్తోంది. ఈ ఏడాదిలో ఒక్క జూలై నెలలోనే జూన్‌తో పోలిస్తే అమెరికా నుంచి ముడి చమురు దిగుమతులలో 23 శాతం పెరుగుదల ఉంది. భారత్ దిగుమతి చేసుకునే మొత్తం ముడి చమురులో అమెరికా వాటా 3 శాతం నుంచి 8 శాతానికి పెరగడం గమనార్హం.

**భారత్‌పై సుంకం విధింపు**

రష్యా నుంచి సైనిక పరికరాలు, చమురును కొనుగోలు చేస్తున్నందుకు భారత్‌పై 25 శాతం సుంకం విధిస్తున్నట్లు జూలై 30న ట్రంప్ ప్రకటించారు. ఉక్రెయిన్‌లో ప్రజలను చంపడం రష్యా ఆపాలని ప్రతి ఒక్కరూ కోరుతున్నప్పటికీ భారత్ మాత్రం రష్యా నుంచి చమురు దిగుమతులను కొనసాగిస్తూనే ఉందని, ఇది మంచిది కాదని ట్రంప్ అన్నారు. రష్యాతో వాణిజ్యం కొనసాగిస్తున్నందుకు ఆగస్టు 1 నుంచి భారత్ 25 శాతం సుంకం, జరిమానా కట్టాలని ప్రకటించారు. ప్రస్తుతం భారత్ తన చమురు అవసరాలలో సుమారు 40 శాతాన్ని రష్యా నుంచి దిగుమతి చేసుకుంటున్నది. రష్యా నుంచి ప్రతిరోజు 11.50 లక్షల బ్యారెళ్ల ముడి చమురును భారత్ ప్రస్తుతం దిగుమతి చేసుకుంటున్నది.

**అమెరికా ఒత్తిడికి తలొగ్గి**

అమెరికా నుంచి వస్తున్న ఒత్తిళ్లు, పెరుగుతున్న ధరలను దృష్టిలో ఉంచుకుని రష్యా నుంచి చమురు కొనుగోళ్లను భారత్ దాదాపు నిలిపివేసిందని రాయిటర్స్ వార్తాసంస్థ కథనం పేర్కొంది. ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్, హిందుస్థాన్ పెట్రోలియం, భారత్ పెట్రోలియం వంటి భారతీయ చమురు కంపెనీలు రష్యా నుంచి చమురు కొనుగోళ్లను నిలిపివేశాయని తెలిపింది. రాయితీలు తగ్గడం, సరకు రవాణాలో ఇబ్బందులు తలెత్తడమే ఇందుకు కారణమని వార్తాసంస్థ పేర్కొంది. రష్యా నుంచి ముడి చమురును 2022 నుంచి కొనుగోలు చేస్తున్నా మొట్టమొదటిసారి అతి తక్కువ రాయితీ ఇప్పుడే లభిస్తున్నదని, దీంతో రష్యా నుంచి కొనుగోళ్లను భారతీయ చమురు సంస్థలే నిలిపివేశాయని వార్తాసంస్థ పేర్కొంది. అయితే, రష్యా నుంచి చమురు కొనుగోళ్లను భారత్ నిలిపివేస్తున్నట్లు వస్తున్న వార్తలపై అమెరికా అధ్యక్షుడు ట్రంప్ స్పందించారు. రష్యా నుంచి ఇక ఎక్కువ కాలం చమురును భారత్ కొనుగోలు చేయదని వార్తలు వస్తున్నాయని, అయితే ఈ వార్తలలోని నిజానిజాలు తనకు తెలియవని ఆయన వ్యాఖ్యానించారు. ఒకవేళ అదే జరిగితే మంచి విషయమేనని అన్నారు. తర్వాత ఏం జరుగుతుందో వేచి చూద్దామని కూడా ఆయన వ్యాఖ్యానించారు. దీనిపై విదేశాంగ శాఖ అధికార ప్రతినిధి రణ్‌ధీర్ జైశ్వాల్ స్పందిస్తూ.. భారత చమురు అవసరాలకు సంబంధించి అంతర్జాతీయ మార్కెట్‌లో ధరల ఆధారంగా, అప్పటి అంతర్జాతీయ పరిస్థితులను బట్టి నిర్ణయాలు ఉంటాయని చెప్పారు. రష్యా నుంచి చమురు కొనుగోళ్లు నిలిపివేశారా లేదా అన్నది సూటిగా సమాధానం చెప్పలేదు.

**భారత్‌పై మోయలేని భారం**

అమెరికా ఒత్తిడికి తలొగ్గి రష్యా నుంచి ముడి చమురు, రక్షణ పరికరాల దిగుమతులను భారత్ పూర్తిగా నిలిపివేసిన పక్షంలో భారత్ చమురు దిగుమతి ఖర్చులు ఏటా 1100 కోట్ల డాలర్లకు (దాదాపు 95 వేల కోట్లు) పెరుగుతాయని నిపుణులు హెచ్చరించారు. ప్రపంచంలోనే మూడవ అతి పెద్ద చమురు దిగుమతిదారైన భారత్ భారీ రాయితీతో రష్యా నుంచి చమురును దిగుమతి చేసుకుని గణనీయ స్థాయిలో ప్రయోజనం పొందింది.